ఎన్నాళ్లీ పరిస్థితి ?



పద్మశాలి టౌన్‌షిప్ ఓక్ వ్యాలీ స్కూల్ వద్ద రోడ్డు దుస్థితి

- దెబ్బతిన్న రోడ్డుతో వాహనదారులకు ఇబ్బంది
- సమస్యను పరిష్కరించాలని స్థానికుల వినతి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ పద్మశాలి టౌన్‌షిప్ సమీపంలోని ఓక్‌వ్యాలీ స్కూల్ వద్ద దెబ్బతిన్న రోడ్డుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు సమస్యతో పాటు నాలాపై ఉన్న స్లాబ్ కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు..

గత కొద్ది రోజుల క్రితం అక్కడ సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కుషాయిగూడ నుంచి దమ్మాయిగూడ వైపు వెళ్లే వాహనదారులు, స్థానికులు ఇదే మార్గాన్ని అనుసరిస్తారు. దీంతో ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండి రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతాయి. ఏళ్ల తరబడి ఉన్న గుంతల రోడ్డు సమస్యకు కొంత మేర పరిష్కారం చూపారు.

స్లాబ్ కుంగిపోవడంతో..

నాలాపై ఉన్న స్లాబ్ వర్షానికి కుంగిపోవడంతో రోజులు, నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలా స్లాబ్ పరిస్థితి ఇలాగే ఉంటే అక్కడి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చినుకు పడిందంటే చాలు పాదచారులు కాలు పెట్టే పరిస్థితి ఉండదు. అంతా బురదమయంగా మారిపోతుంది.

రెండు డివిజన్ల మధ్యలో..

చర్లపల్లి, ఏఎస్‌రావునగర్ రెండు డివిజన్ల మధ్యలో రోడ్డు ఉండటంతో ఇక్కడ సమస్య ఏర్పడితే రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని, పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

చెత్త, మట్టికుప్పలతో..

మరోవైపు ఆ మార్గం సమీపంలోనే డబుల్ లేన్‌రోడ్డు ఉంది. దాన్ని పూర్తిగా చెత్తకుప్పలు, మట్టి కుప్పలతో మూసివేశారు. దీంతో ఉన్న ఒకే మార్గంలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం వాకర్స్ కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని వాహనదారులతో పాటు పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.

మయూరి కళానికేతన్ కూచిపూడి నృత్యోత్సవం



కార్యక్రమంలో చిన్నారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

అల్వాల్: నృత్య మయూరి కళానికేతన్ కూచిపూడి నృత్యోత్సవం సోమవారం అల్వాల్ డివిజన్ వేణుగోపాల్‌నగర్ కాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురు జయంతి నారాయణ ఆధ్వర్యంలో చెంచులక్ష్మి కూచిపూడి బాలెట్ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కూచిపూడి గ్రామంలో పుట్టిన కూచిపూడి నాట్యం మనో వికాసానికి తోడ్పాటు అవుతుందన్నారు. కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతీదేవి ఉపాసకులు మంగళగిరి నరసింహామూర్తి, గురు నీరజాదేవి, డాక్టర్ వేదాంతం, వెంకటనాగ చలపతిరావు, రవీందర్, డిప్యూటీ డైరెక్టర్ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



భూమిపూజలో ఎమ్మెల్యే బండారి తదితరులు

రామంతాపూర్: ఇందిరానగర్ డిమార్ట్ రోడ్డులో స్థానిక మార్కండేయస్వామి ఆలయ ముఖ ద్వారం నిర్మాణానికి సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధ్యాత్మిక భావనలతో దైవచింతన చేసి భగవంతున్ని ఆరాధిస్తే మనస్సుకు శాంతి ఆరోగ్యం ఆనందం కలుగుతాయన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ముఖద్వారాన్ని నిర్మించాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ జున్న వెంకటయ్య, అధ్యక్షులు చిక్క సత్యనారాయణ, ఉపాధ్యాయులు వనం యాదగిరి, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి గజం మురళి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆలయ ముఖద్వారా నిర్మాణ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ముఖ ద్వారా నిర్మాణ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బండారు వెంకటరావు, ఆలె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.54 లక్షలతో సీసీ రోడ్డు పనులు



కార్పొరేటర్‌ను సత్కరించిన నాచారం గ్రామపెద్దలు

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లో రూ.54 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభమవుతాయని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. సోమవారం నాచారం పాత గ్రామానికి చెందిన పెద్దలు నమిలికొండ భూపాల్‌రెడ్డి, సాయిబాబా, యాదగిరిగౌడ్, భరత్, ప్రశాంత్‌లు కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతంలో సీసీరోడ్డు పనులకు రూ.30,50,000లు మంజూరై రాకపోవడంతో పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ఈనెల 2న జోనల్ కమిషనర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జరిగిన విషయం చెప్పి సీసీరోడ్డు పనులకు రూ.54 లక్షలు మంజూరు చేయాలన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించామన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించినందుకు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

ఉప్పల్ కురుమ యువత నూతన కమిటీ



ఉప్పల్: ఉప్పల్ కురుమ యువత నూతన కమిటీని ఉప్పల్ బీరప్పగడ్డ ఆలయంలో ఎన్నుకున్నారు. యువ అధ్యక్షులుగా ముత్యంగారి రాకేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బట్కీర్ కుమార్, ఉపాధ్యక్షులుగా గౌరిగె శివాజీ, శివకుమార్, ప్రధాన కార్యదర్శులుగా కరికె మహేష్, సోము బాలకృష్ణ, కోశాధికారిగా మరాటి శ్రీను, సహాయ కార్యదర్శిగా ఎర్ర వెంకటేష్‌లను ఎన్నుకున్నారు.

మహిళ కమిటీ..

ఉప్పల్ కురుమ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలిగా బట్కీర్ మంజుల, ఉపాధ్యక్షురాలిగా ముత్యంగారి లత, ప్రధాన కార్యదర్శిగా ఇందిర, సంయుక్త కార్యదర్శిగా ఏనుగు ధనలక్ష్మి, సహాయ కార్యదర్శిగా గౌరిగే భాగ్య, కోశాధికారిగా సుబ్బారి రజిత, సలహాదారులుగా కళ్యాణం గీతారాణిలను ఎన్నుకున్నారు.

కురుమ ఉద్యోగుల కమిటీ..

కురుమ ఉద్యోగుల కమిటీ అధ్యక్షులుగా దయ్యాల అమరేందర్, ఉపాధ్యక్షులుగా ఎర్ర మహేష్, ఏనుగు వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా శాగ జగన్, సంయుక్త కార్యదర్శిగా గౌరిగె యశ్వంత్, సహాయ కార్యదర్శిగా గౌరిగె శివ, కోశాధికారిగా సోము రమేష్, సలహాదారులుగా బుడిగె పోచయ్య, ప్రొ. కడగంచి రామాంజనేయులను ఎన్నుకున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 20వ డివిజన్ రాఘవేంద్రకాలనీలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. శంకుస్థాపన చేసిన పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ జడిగె మహేందర్‌యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు తోటకూర శ్రీశైలంయాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ నూతన కమిషనర్‌గా చంద్రశేఖర్



ఘట్‌కేసర్: మున్సిపల్ నూతన కమిషనర్‌గా బొందుగుల చంద్రశేఖర్‌గుప్తా సోమవారం బాధ్యత స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన సాబేర్ అలీ నిజాంపేట్‌కు బదిలీ కాగా, మీర్‌పేట్ కమిషనర్ ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానని, మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, వైస్‌చైర్మన్ మాధవరెడ్డిల ఆధ్వర్యంలో కమిషనర్‌ను సత్కరించారు. కౌన్సిల్ సభ్యులు ఆంజనేయులు గౌడ్, వెంకట్‌రెడ్డి, రమాదేవి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడిసిటీ క్లినిక్‌లు ప్రారంభం

మేడ్చల్ రూరల్: రావల్‌కోల్, అక్బర్జాపేట్‌లో మెడిసిటీ ఆధ్వర్యంలో సోమవారం నూతన క్లినిక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సీఈఓ దినేష్, సీఏఓ సత్యంరెడ్డి మాట్లాడుతూ.. మెడిసిటీ ఆసుపత్రికి రాలేని వారు స్థానిక క్లినిక్‌లో వైద్యం పొందొచ్చన్నారు. క్లినిక్‌లో బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు ముక్కు, గొంతు, బీజుకుట్లు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచి సంబంధ సమస్యలు, మోకాళ్ల, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలకు ఉచిత పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. టెస్టులు, ఆపరేషన్ అవసరం ఉన్నవారికి మెడిసిటీ ఆసుపత్రిలో వైద్యం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్, మాజీ సర్పంచులు మహేందర్, రాములుగౌడ్, మాజీ ఎంపీటీసీ అంకిత పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ఉప్పల్: బీరప్పగడ్డ వెస్ట్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చైల్డ్ సురక్ష ఫౌండేషన్ సహకారంతో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి సలహాలు ఇచ్చారన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



అనురాగ్ స్కూల్‌లో పంపిణీ చేస్తున్న డా. రామ్

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక దివ్యాంగుల స్కూల్ ఫౌండర్ డాక్టర్ రామ్ వృద్ధులకు చేయూతనందించారు. ఈ సందర్భంగా సోమవారం బీజేఆర్‌నగర్, వాజ్‌పేయినగర్, ఎల్లారెడ్డిగూడ, మధురానగర్‌కు చెందిన పలువురు వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌బీఐ మేనేజర్ ప్రీతిగ్రేస్ మాట్లాడుతూ.. వృద్ధుల కోసం అనురాగ్ స్కూల్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. సింగరేణి మాజీ ఉద్యోగి రామచంద్రమూర్తి, గోపిరెడ్డి, బిందు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా వినతులపై తక్షణమే స్పందించాలి

సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 71 ఫిర్యాదులు స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ.. ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులకు ఆయన సూచించారు. డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ విజేతలకు బహుమతులు ప్రదానం



మేడ్చల్ రూరల్: పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించిన 36 గంటల హ్యాకథాన్ సోమవారం ఘనంగా ముగిసింది. వీఎస్‌ఆర్ వీజేబీటీ విద్యార్థులు ప్రథమ, ఐఐటీ మద్రాస్, హైదరాబాద్ కేఎల్ విశ్వవిద్యాలయం ద్వితీయ, నర్సింహారెడ్డి ,సీఎంఆర్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలువగా రూ. 30, రూ. 20 వేల నడవు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ.. హ్యాకథాన్‌తో విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, హెచ్‌ఓడీ రాము, సమన్వయ కర్త దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



అల్వాల్ డీసీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, వినతులను సత్వరం పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని మేయర్ అమర్‌సింగ్ అధికారులను ఆదేశించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అల్వాల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. కొకూర్ ప్రశాంతి విహార్‌లో ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని, బోర్‌వెల్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అంతర్గత రోడ్లతో పాటు మౌలికవసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ఉపకమిషనర్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఆర్‌పి. తివారి, ధర్మారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కులు !



జ్యోతినగర్ పార్కులో వాకింగ్ ట్రాక్



పచ్చదనంతో ఆకట్టుకుంటున్న గార్డెన్

గౌతంనగర్: కుటుంబసభ్యులతో సమయం ఉన్నప్పుడల్లా కలిసి ఆహ్లాదం కోసం పార్కులకు వచ్చేవారితో పాటు నిత్యం వాకింగ్ చేసేవారికి అనుకూలంగా ఉండేలా పార్కులను సుందరీకరించారు. దీనికి తోడు జ్యోతినగర్, గౌతంనగర్ పార్కుల్లో ఆహ్లాదంగా గడిపేలా సుందరీకరణ పనులను అధికారులు చేపట్టారు. ఈ పార్కుల్లో గౌతంనగర్‌కు చెందిన పలు కాలనీవాసులు, వయోవృద్ధులు, చిన్నారులు, యువత సద్వినియోగం చేసుకుంటున్నాయి. ఆఫీసుల్లో పని ఒత్తిడి, గంటల తరబడి కంప్యూటర్ స్క్రీన్లపై పనిచేయడంతో పాటు మానసిక ప్రశాంతత కరువవుతున్న వారు సాయంత్రం వేళల్లో పార్కుల్లో సేదతీరుతున్నారు.

చెత్త సేకరణపై నిర్లక్ష్యం ఎలా..!

- తడి, పొడి సేకరణలో నెరవేరని లక్ష్యం
- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్లు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో 29 పురపాలక సంఘాలు ఉండగా.. రోజూ లక్షకు పైగా జనాభా కలిగిన పురపాలికలో దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. పురపాలికల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాల్సి ఉన్నా.. ఎక్కడా సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది. సంబంధిత అధికారులు మాత్రం చెత్త వాహనాలకు మైకులు పెట్టుకొని తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో అమలు నోచుకోవటం లేదని తెలుస్తోంది.

సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత..

చెత్తను తరలించే వాహనాలు వార్డులు /డివిజన్లకు సమయానికి రాకపోవడంతో పురపాలికల్లో పలుచోట్ల చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో తడి,పొడి చెత్త విభజన జరగడం లేదు. ప్రతి వార్డు/డివిజన్‌కు వాహనంతో పాటు సిబ్బందిని కేటాయించినా.. సేకరణ విషయంలో అలసత్వం వహిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తేనే స్పందన..

పురపాలికల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తడి, పొడి చెత్త సేకరణ అమలు కావడం లేదు. వార్డు అధికారులు చెత్త సేకరణను నిత్యం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ సక్రమంగా చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పా.. స్పందించటం లేదని తెలుస్తోంది. కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త సేకరణ అమలుకు పునాది పడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవగాహన కల్పించి తడి, పొడి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు ..

పురపాలికల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదనే విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని సంబంధిత మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. పట్టణాల్లో వార్డుల వారీగా పరిశీలించి తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. పట్టణ ప్రజలు కూడా ఎప్పటికప్పుడు చెత్త సేకరణలో జరుగుతున్న జాప్యాన్ని తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



ప్రతిష్ఠాపనోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: యాప్రాల్ సాయికృపకాలనీలోని ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ భవానీరామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నేరేడ్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సత్యనారాయణబాబు, నాయకులు ధనలక్ష్మి, వెంకటేష్, సుధారాణి, శర్మ, వెంకట్‌రెడ్డి, నవీన్, వినయ్, తమిళ్‌వాణి పాల్గొన్నారు.

రోబోకప్‌లో విద్యార్థుల ప్రతిభ



చైనాలో రోబోకప్‌లో పాల్గొన్న స్థానిక విద్యార్థులు

ఉప్పల్: చైనాలో నిర్వహించిన రోబోకప్ జూనియర్ ఆసియా పసిఫిక్‌కప్‌లో ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అక్టోబర్ 24 నుంచి 27 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో పదోతరగతికి చెందిన అమన్ విశ్వక్, తొమ్మిదో తరగతి విద్యార్థి మనీష్‌లు అండర్– 19 జూనియర్ విభాగంలో మూడో స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు సహకరించిన తల్లిదండ్రులను పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జోసెఫ్ అభినందించారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో డీసీపీ పద్మజ

అల్వాల్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం, ఉచిత మెడికల్ క్యాంపు శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి జోన్ డీసీపీ పీ.వీ.పద్మజ ఐపీఎస్, కుషాయిగూడ డివిజన్ ఏసీపీ మహేష్‌కుమార్‌గౌడ్, నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి యువత, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన పోలీస్ సిబ్బంది, ప్రజలకు డీసీపీ పద్మజ ప్రశంసాపత్రాలను అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కాప్రా డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్, అధికారులు

కాప్రా: డివిజన్‌లోని పలు కాలనీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాప్రా డివిజన్‌లోని కృష్ణానగర్, గోపాల్‌రెడ్డినగర్, వినాయక్‌నగర్ కాలనీల్లో పార్కుల అభివృద్ధి, సీసీరోడ్లు, వీధిదీపాలు, యూజీడీ పనులను పరిశీలించారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ బాలకృష్ణ, ఎలక్ట్రికల్ డిప్యూటీ ఇంజినీర్ రవీందర్, జలమండలి ఏఈ రోహిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, రాకేష్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన



జాతీయ అధ్యక్షుడు అయ్యప్పను సన్మానిస్తున్న దృశ్యం

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ శివసాయినగర్‌లోని కార్యాలయంలో తెలంగాణ స్టేట్ హ్యూమన్‌రైట్స్ గురించి అందరికీ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్యాలయాన్ని మానవ హక్కుల జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ అయ్యప్ప సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా ముందుకెళ్తున్నామన్నారు. నేతలు మోమిన్, బాషా, నంద్యాల కృష్ణ, నారాయణరెడ్డి, దుర్గ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి



మృతుడు గణేష్ (ఫైల్)

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యల కారణంగా ఓ ఇంజినీరింగ్ విద్యార్థి.. గుర్తు తెలియని పురుగుల మందు సేవించి ఘట్‌కేసర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ పరశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం, కడారిగూడెంకు చెందిన గణేష్ (22) రాంపల్లిలో తన స్నేహితులతో కలిసి ఉంటూ.. స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. దసరా పండుగకు ఇంటికి వెళ్లి మరుసటి రోజు హైదరాబాద్‌కు వచ్చాడు. ఈనెల 23న ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో పురుగుల మందు సేవించాడని గణేష్ మిత్రుడు అతడి తల్లికి చెప్పాడు. అనంతరం చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. గణేష్ ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవాడని, స్నేహితుల వద్ద అప్పు చేశాడని, అవి చెల్లించలేకే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.